

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.20

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.20 పలికింది. కనిష్టం రూ.5.50, సరాసరి రూ.14 ప్రకారం అమ్మకాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం 33.2°/ 23.9°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. సాయంత్రం తర్వాత ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షాలు కురిశాయి.

న్యూస్‌రీల్

ఉరవకొండ డిగ్రీ కళాశాలకు న్యాక్ 'ఏ' గ్రేడ్



న్యాక్ 'ఏ' గ్రేడ్ వచ్చిన ఉత్తర్వులు చూపుతున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఉరవకొండ: గ్రామీణ ప్రాంత పరిధిలో ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించింది. ఈ కేటగిరిలో రాష్ట్రంలోనే గుర్తింపు పొందిన ఐదవ కళాశాలగా నిలిచింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందుకు సంబంధించిన వివరాలను ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ అధ్యాపకులతో కలిసి మీడియాకు వెల్లడించారు. ఈ నెల 19, 20 తేదీల్లో ఉరవకొండ డిగ్రీ కళాశాలకు న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం సందర్శించిందన్నారు. బోధన పద్ధతులు, విద్యార్థులకు మౌలిక వసతుల కల్పన వంటివి పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. న్యాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపుతో కళాశాలకు అటానమస్ రావడానికి అవకాశాలు ఉన్నట్లు చెప్పారు. 'ఏ' గ్రేడ్ రావడానికి కృషి చేసిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులు ప్రతి ఒక్కరికీ ప్రిన్సిపాల్ ధన్యవాదాలు తెలిపారు.

'అనంత' ప్రత్యేక అధికారిగా కాంతిలాల్‌దండే

- శ్రీసత్యసాయి జిల్లాకు యువరాజ్

అనంతపురం అర్బన్: జిల్లాలకు ప్రత్యేక అధికారులను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం జిల్లాకు ప్రత్యేక అధికారిగా రవాణా, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేను నియమించారు. శ్రీ సత్యసాయి జిల్లాకు ప్రత్యేక అధికారిగా పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్‌ను నియమించారు.

ఆరు మండలాలకు ఇన్‌చార్జ్ తహసీల్దార్లు

అనంతపురం అర్బన్: జిల్లాలో ఆరు మండలాలకు ఇన్‌చార్జ్ తహసీల్దార్లను నియమిస్తూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లి తిరిగి వచ్చిన తహసీల్దార్లకు ఈ నెల రెండో తేదీన మండలాలకు పోస్టింగ్ ఇచ్చారు. అయితే వివిధ కారణాలతో తహసీల్దార్లు కె.మోహన్‌కుమార్ (కూడేరు), సి.షర్మిల (బెళుగుప్ప), ఎస్.ఈశ్వరమ్మ (తాడిపత్రి), వై.భూషణం (పెద్దపప్పూరు), బి.వాణిశ్రీ (అనంతపురం రూరల్), జి.అలెగ్జాండర్ (రాయదుర్గం) విధుల్లోకి చేరలేదు. దీంతో ఈ స్థానాలను ఇతర మండలాల తహసీల్దార్లకు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించారు. కూడేరుకు ఉరవకొండ తహసీల్దార్, బెళుగుప్పకు కళ్యాణదుర్గం తహసీల్దార్, తాడిపత్రికి పెద్దపప్పూరు తహసీల్దార్, పెద్దవడుగూరుకు యాడికి తహసీల్దార్, అనంతపురం రూరల్‌కు అనంతపురం అర్బన్ తహసీల్దార్, రాయదుర్గంకు కణేకల్లు తహసీల్దార్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు.

శాంతిభద్రతల విషయంలో రాజీ పడొద్దు



బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్ తనిఖీ చేస్తున్న ఎస్పీ జగదీష్

అనంతపురం సెంట్రల్: శాంతిభద్రతల విషయంలో ఎట్టి పరిస్థితిలోనూ రాజీ పడకూడదని ఎస్పీ జగదీష్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం రూరల్ సబ్‌డివిజన్ పరిధిలో రాప్తాడు, ఇటుకలపల్లి, బుక్కరాయసముద్రం పోలీస్ స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆయా స్టేషన్ల పరిధిలో సమస్యాత్మక గ్రామాలపై ఆరా తీశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై నిఘా ఉంచాలని, మట్కా, గుట్కా, పేకాట, బెట్టింగ్, గంజాయి, నాటుసారా తదితర చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అనంతపురం రూరల్ డీఎస్పీ శివారెడ్డి, సీఐలు వెంకట శ్రీహర్ష, హేమంత్ కుమార్, శ్రీధర్, ఎస్‌ఐ విజయకుమార్ పాల్గొన్నారు.

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి

పోలీసుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్పీ జగదీష్ హామీ ఇచ్చారు. శుక్రవారం పోలీసు సిబ్బంది సమస్యలపై నిర్వహించిన ప్రత్యేక గ్రీవెన్స్‌లో 25 మంది సిబ్బంది బదిలీలు, సస్పెన్షన్ రీటక్ తదితర సమస్యలపై అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ రమణమూర్తి, ఏఓ శంకర్, సూపరింటెండెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

రావణ కాష్టం.. రాక్షసానందం!

'మీరేంటో.. మీ విధానాలేంటో..' అంటూ ఓ సినిమాలో రావు రమేష్ చెప్పిన డైలాగ్ వారికి బాగా సరిపోతుంది. నిత్యం వివాదాలకు వారే ఆజ్యం పోస్తూ చలికాచుకోవడం రివాజుగా మారింది. గత ఐదేళ్లు ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించిన తాడిపత్రి నియోజకవర్గ ప్రజలు ప్రస్తుతం జేసీ ఆగడాల కారణంగా బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తోంది.



- మితిమీరిన జేసీ ప్రభాకర్ రెడ్డి, అస్మిత్ రెడ్డి ఆగడాలు
- గడిచిన ఐదేళ్లూ ప్రశాంతంగా ఉన్న తాడిపత్రిలో నేడు రోజూ అలజడే
- ఇసుక తోలేది వాళ్లే.. ఫిర్యాదు చేసేదీ వాళ్లే
- మాజీ ఎమ్మెల్యేను తాడిపత్రికి రానివ్వకుండా గొడవలు
- పోలీసులపై ప్రతాపం.. క్షమాపణలు చెప్పే వరకు వదలని వైనం
- ఉన్నతాధికారులే సారీ చెప్పించడంపై పోలీసు వర్గాల్లో తీవ్ర అసంతృప్తి
- నిత్యం వివాదాలతో భయాందోళనలో నియోజకవర్గ ప్రజలు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 13 నియోజకవర్గాలు ఒకరకం.. తాడిపత్రి ఒక్కటీ మరో రకంగా మారింది. 'మేమే రాజులం, మేమే మంత్రులం.. మేము రాసిందే రాజ్యాంగం' అనే రీతిలో జేసీ ప్రభాకర్‌రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారు. తమకు వ్యతిరేకంగా మాట్లాడిన వారిపైనా, ప్రత్యర్థి పార్టీలోని నాయకులపైనా దాడులు చేయడమే కాకుండా తిరిగి వారిపైనే కేసులు పెట్టిస్తూ రాక్షసానందం పొందుతున్నారు.

ఇసుక అక్రమాలపై కావాలనే రాద్ధాంతం..

అధికారం చేతిలో ఉందికదా అని జేసీ ప్రభాకర్ రెడ్డి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్టు చర్చ జరుగుతోంది. '25 మంది ఇసుక తోలేది మా వాళ్లే.. మీరందరూ ఇసుక తోలడం మానుకోండి. లేదా నాకు దూరమవుతారు' అంటూ ఇటీవల ప్రభాకర్‌రెడ్డి వీడియో సందేశాలు విడుదల చేశారు. అయితే, జేసీ వ్యాఖ్యలను నిశితంగా గమనిస్తే అందులో మరో కోణం అవగతమవుతుంది. తన వర్గం నాయకులు సాగిస్తున్న ఇసుక దందాను నిలిపివేయించి తానే సొంత వాహనాలతో ఇసుక అక్రమ రవాణా సాగించాలన్న మర్మం బయటపడుతుంది. జిల్లాల వారీగా చంద్రబాబు ప్రభుత్వం విజిలెన్స్ రిపోర్టులు తయారు చేయిస్తోందన్న సమాచారం అందడంతోనే డ్రామాలు ఆడుతున్నారన్న విమర్శలు మరోవైపు వినిపిస్తున్నాయి.

పోలీసుల్లో అసంతృప్తి..

తాడిపత్రి మండలంలో ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను ఇటీవల పోలీసులు పట్టుకోగా.. ఎమ్మెల్యే అస్మిత్ రెడ్డి వెంటనే సీఐ లక్ష్మీకాంత్ రెడ్డికి ఫోన్ చేసి కేసులు కట్టాలంటూ దురుసుగా వ్యవహరించారు. ఎప్పుడు కేసులు కట్టాలో తనకు తెలుసునని సీఐ చెప్పగా.. ఆయనను ఇష్టారాజ్యంగా మాట్లాడారు. ఈ క్రమంలో సీఐను వెనకేసుకు రావాల్సిన పోలీసు ఉన్నతాధికారులు అందుకు భిన్నంగా వ్యవహరించి, సీఐతో ఎమ్మెల్యేకు క్షమాపణ చెప్పించారు. నిజాయితీగా పనిచేసే ఓ సీఐ పట్ల ఉన్నతాధికారులు వ్యవహరించిన తీరుపై పోలీసు వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. ఎస్పీ స్థాయి వ్యక్తి క్షమాపణలు చెప్పించడమేంటని కింది స్థాయి పోలీసు అధికారులు వాపోతున్నారు. ఇదే క్రమంలో.. తాను ఏ తప్పూ చేయలేదని, శాంతిభద్రతలకు విఘాతం కలగకూడదనే క్షమాపణలు చెప్పానని సీఐ పేర్కొనడం గమనార్హం.

మాజీ ఎమ్మెల్యే రాకుండా అడ్డంకులు..

మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి తాడిపత్రిలోకి అడుగుపెట్టకుండా దాడులు చేయిస్తున్నారంటే జేసీ ప్రభాకర్‌రెడ్డి గూండాగిరీ ఏ స్థాయిలో ఉందో ఇట్టే తెలుసుకోవచ్చు. ఇటీవల ఎన్నికల పోలింగ్ రోజు రాళ్లు రువ్వుకున్న ఘటనలో ప్రభాకర్‌రెడ్డి, పెద్దారెడ్డిలు ఇద్దరిపైనా కేసులు నమోదయ్యాయి. ఆ తర్వాత ఇద్దరికీ బెయిలొచ్చింది. కానీ పెద్దారెడ్డిని తాడిపత్రికి రానివ్వకుండా జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకుంటున్నారు. ఇటీవల పెద్దారెడ్డి తాడిపత్రికి వెళ్లగా తన అనుచరులతో దాడులు చేయించారు. కందిగోపుల మురళి అనే వైఎస్సార్ సీపీ నాయకుడి ఇంటిని ధ్వంసం చేశారు. ఇంత జరుగుతున్నా జిల్లా పోలీసులు చేష్టలుడిగి చూస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

పనిచేయడానికి అధికారులే రావడం లేదు..

జేసీ కుటుంబం దెబ్బకు నియోజకవర్గంలో పనిచేసేందుకు అధికారులే రావడం లేదంటే అతిశయోక్తి కాదు. తాడిపత్రి తహసీల్దార్‌గా వెళ్లిన ఈశ్వరమ్మ కొన్ని రోజులకే తానక్కడ పనిచేయలేనంటూ తిరిగి వచ్చేశారు. తాడిపత్రి టౌన్‌కు ఎస్‌ఐ ఉన్నా అటాచ్‌డ్ కింద పెదపప్పూరు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. రూరల్ పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐ లేరు. తమకు ఎప్పుడు బదిలీ వస్తే వెళ్లిపోదామా అన్న ఆలోచనలో రవాణా శాఖ సిబ్బంది ఉన్నారు. మైనింగ్, రెవెన్యూ, ఆరోగ్య.. ఇలా ఏ శాఖ అధికారులైనా తాడిపత్రిలో పనిచేసేందుకు జంకుతున్నారు. పోలీసులన్నా, అధికారులన్నా తన కింద గుమస్తాలే అన్న రీతిలో జేసీ వ్యవహరిస్తున్నారని ప్రభుత్వ ఉద్యోగులు వాపోతున్నారు.

పంట నష్టం రూ.11 కోట్లు

- ఇటీవల వర్షాలకు దెబ్బతిన్న వ్యవసాయ, ఉద్యాన పంటలు



కళ్యాణదుర్గం సమీపంలో దెబ్బతిన్న టమాట పంటను పరిశీలిస్తున్న జేసీ శివనారాయణ శర్మ

అనంతపురం అగ్రికల్చర్: ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు రూ.11 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు ఆయా శాఖల అధికారులు ప్రాథమిక అంచనాలు సిద్ధం చేశారు. వీటిని మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు బాధిత రైతులకు పెట్టుబడి రాయితీ (ఇన్‌పుట్ సబ్సిడీ) అందేలా ప్రభుత్వానికి నివేదిక అందించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఉపరితల అవర్తన ప్రభావంతో ఇటీవల పగలు గరిష్ట ఉష్ణోగ్రతలు, రాత్రిళ్లు బలమైన గాలులలో కూడిన భారీ వర్షాలు నమోదైన విషయం తెలిసిందే. దీంతో 22 మండలాలు, 80 గ్రామాల పరిధిలో కంది, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, వరి, ఆముదం, మినుము, సోయాబీన్, కొర్ర, సజ్జ, పొద్దుతిరుగుడు తదితర పంటలు 1,707 హెక్టార్లలో దెబ్బతినడంతో 2,007 మంది రైతులకు రూ.5 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది. అలాగే కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, రాయదుర్గం, గుమ్మఘట్ట, కణేకల్లు, బుక్కరాయసముద్రం, శింగనమల, నార్పల, పుట్లూరు, తాడిపత్రి, పెద్దపప్పూరు, యాడికి, పామిడి, గుంతకల్లు, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, బెళుగుప్ప, ఉరవకొండ, కూడేరు, వజ్రకరూరు, గార్లదిన్నె, అనంతపురం, ఆత్మకూరు, రాప్తాడు మండలాల పరిధిలో 300 హెక్టార్లలో టమాట, బీన్స్, బీర, దోస, కళింగర, కర్బూజా, గుమ్మడి, ఉల్లి, బొప్పాయి, బెండ, చీనీ తదితర పంటలు దెబ్బతినడంతో 408 మంది రైతులకు రూ.5.67 కోట్లకు పైగా నష్టం జరిగినట్లు ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు.

టీచర్ల 'పని సర్దుబాటు' లీలలు

- అనుకుంటే బయటకు.. లేదంటే అదే స్కూల్లోనే..
- గందరగోళంగా మారిన సర్దుబాటు
- ఎస్జీటీలను బలవంతంగా పంపుతున్న వైనం
- ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారిన ప్రక్రియ
- పలు స్కూళ్లు ఏకోపాధ్యాయ స్కూల్‌గా మారే ప్రమాదం
- ఉమ్మడి జిల్లాలో మండిపడుతున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు



అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల 'పని సర్దుబాటు' ప్రక్రియ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర గందరగోళానికి తెర తీస్తోంది. ఈ విద్యా సంవత్సరం కోసం చేపడుతున్న ఈ ప్రక్రియ ప్రహసనంగా మారింది. ప్రాథమిక విద్యకు, ఎస్జీటీలకు తలపోటుగా తయారైంది. ఈ నెల 8న ప్రారంభమైన 'మిగులు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ' సాగుతూనే ఉంది. ఎట్టకేలకు మండలస్థాయి సర్దుబాటును మూడు రోజుల కిందట పూర్తి చేశారు. ఇక్కడంతా తప్పుల తడకగా, తూతూమంత్రంగా ముగించేశారు. 'సర్దుబాటు'.. ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారింది. ఉన్నత పాఠశాలల్లో అవసరమైన మేరకు సబ్జెక్టు టీచర్లను నియమించడమే లక్ష్యంగా 117 జీఓను అనుసరించి సర్దుబాటు చేస్తున్నారు. మిగులుగా ఉన్న సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేస్తే సరిపోతుంది. కానీ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలను సబ్జెక్టు మెథడాలజీని బట్టి ఉన్నత పాఠశాలలకు బలవంతంగా సర్దుబాటు చేస్తున్నారు. గతేడాదే ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించారు. విల్లింగ్ ఉన్న ప్రతి ఎస్జీటీకీ పదోన్నతి కల్పించి ఉన్నత పాఠశాలలకు కేటాయించారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలు వివిధ వ్యక్తిగత కారణాల వల్ల పదోన్నతులు వదులుకుని కొనసాగుతున్నారు. వారినే సబ్జెక్టు టీచర్లుగా ఉన్నత పాఠశాలలకు వెళ్లాలంటూ బలవంతం చేస్తున్నారు. తాము స్కూల్ అసిస్టెంట్‌గా వెళ్లేందుకు నాట్ విల్లింగ్ ఇచ్చామని, ఇప్పుడేమో సబ్జెక్టులు బోధించాలంటూ సర్దుబాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు పంపుతుండడతో చాలా స్కూళ్లు ఏకోపాధ్యాయ స్కూళ్లుగా మారుతున్నాయి. భవిష్యత్తులో వీటి ఉనికి ప్రశ్నార్థకం కానుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు.

సా...గుతోన్న సర్దుబాటు ప్రక్రియ

వారాల తరబడి సర్దుబాటు ప్రక్రియ సాగుతుండడంతో స్కూళ్లలో బోధనకు ఇబ్బందిగా మారింది. సర్దుబాటులో ఎవరు ఏ స్కూల్‌కు వెళ్లాలో అనే కంగారుతో టీచర్లు చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారు. జూనియర్లను సీనియర్లుగా, సీనియర్లను జూనియర్లుగా చూపిస్తూ తీవ్ర గందరగోళానికి తెర తీశారు.

తపోవనం స్కూల్‌లో సర్దుబాటు ఏదీ?

అనంతపురం రూరల్ మండలం తపోవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో ఒక్కో టీచరును మిగులుగా చూపించారు. ఇంగ్లిష్ టీచరు తాను సీనియర్‌నంటూ అందుకు సంబంధించి ఆధారాలు చూపించి మినహాయింపు పొందారు. ఈయన కాకుంటే మరో టీచరునైనా బయటకు పంపాలి. అది జరగలేదు. గణితం సబ్జెక్టులోనూ మిగులుగా చూపించిన టీచరు తాను సీనియర్‌నంటూ ఆధారాలను ఉన్నతాధికారులకు చూపించి మినహాయింపు పొందారు. తర్వాతి టీచరును మిగులుగా చూపించి ఏదో ఒక స్కూల్‌కు సర్దుబాటు చేయాల్సి ఉంది. అలా చేయకుండా స్కూల్‌లో ఓ కీలక టీచరు మంత్రాంగం నడిపారు. ప్రత్యేక కేటగిరీ టీచర్లకు మండలస్థాయిలో మినహాయింపు లేదు. డివిజన్ స్థాయిలో ఉంటుంది. పక్కా స్కెచ్ వేసి సదరు టీచరును డివిజనల్ స్థాయిలో మిగులు కింద చూపించారు. ఆమె ప్రత్యేక కేటగిరీకి అర్హురాలు కావడంతో మినహాయింపు పొందారు. ఏది ఏమైనా ఈ స్కూల్ నుంచి ఒక్క టీచరునూ సర్దుబాటు చేయలేదు. రూరల్ మండలం చియ్యేడు ఉన్నత పాఠశాలకు గణితం సబ్జెక్టు టీచరు అవసరం కాగా...రుద్రంపేట ప్రాథమిక పాఠశాల నుంచి ఎస్జీటీని సర్దుబాటు చేశారు. తపోవనం జెడ్పీ స్కూల్‌లో గణితం సబ్జెక్టు టీచరు మిగులుగా ఉన్నా... ఎస్జీటీని పంపడం వెనుక ఉద్దేశం ఏంటో అధికారులకే తెలియాలి.

పెనుకొండలో కొత్త వివాదం

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలో కొత్త వివాదం తలెత్తింది. మండల స్థాయి సర్దుబాటులో చూపించని టీచరును డివిజినల్ స్థాయిలో మిగులుగా చూపించారు. పెనుకొండ పట్టణం దర్జీపేట ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఒక తెలుగు టీచరు మిగులుగా ఉన్నారు. మండలంలోనే సీనియర్ కావడంతో ఆయనకు మంచి స్కూల్ దొరుకుతుందనే కారణంగా ఎంఈఓ-2 ఎంట్రీ ఇచ్చి సదరు టీచరును మండలస్థాయిలో మిగులుగా చూపించకుండా వ్యూహం రచించారు. ఇప్పుడు అదే తెలుగు టీచరును డివిజన్ స్థాయిలో అదే ఎంఈఓ-2 మిగులుగా చూపించారు. ఇందుకు బాధ్యులెవరో విద్యాశాఖ ఉన్నతాధికారులే చెప్పాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

జిల్లాను హరిత వనంగా మారుద్దాం

- కలెక్టర్ వినోద్‌కుమార్

బుక్కరాయసముద్రం: జిల్లాను హరిత వనంగా మార్చేందుకు మొక్కలు విరివిగా నాటుదామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. శుక్రవారం జంతలూరు వద్ద ఉన్న సెంట్రల్ యూనివర్సిటీలో అటవీ శాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలెక్టర్ వినోద్‌కుమార్, ఎస్పీ జగదీష్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే సురేంద్రబాబు, సెంట్రల్ యూనివర్సిటీ వీసీ ఎస్‌ఏ కోరి, ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛోఫెర్రర్ హాజరయ్యారు. కలెక్టర్ మాట్లాడుతూ వర్షాలు సమృద్ధిగా కురవాలంటే మొక్కలు పెద్ద ఎత్తున నాటాలన్నారు. రాష్ట్రంలోనే అవెన్యూ ప్లాంటేషన్ అత్యధికంగా అనంతపురం జిల్లాలోనే చేపట్టినట్లు చెప్పారు. 113 కిలో మీటర్లు, 80 హెక్టార్లలో బ్లాక్ ప్లాంటేషన్ చేశామన్నారు. 94 కేంద్రాలలో మొక్కలు నాటామన్నారు. ప్రభుత్వ సంస్థలతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పచ్చదనంలో రాష్ట్రానికే రోల్ మోడల్‌గా అనంతపురం జిల్లా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఎఫ్‌ఓ వినీత్‌కుమార్, జిల్లా జైలు సూపరింటెండెంట్ రహ్మాన్, ఓపెన్ ఎయిర్ జైలు సూపరింటెండెంట్ చంద్రశేఖర్, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ తేజోత్స్న, లక్ష్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మొక్కల సంరక్షణపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

నాణ్యమైన భోజనం పెట్టండి

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన, రుచికరమైన భోజనం పెట్టాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం రోటరీపురంలో ఉన్న జెడ్పీ హైస్కూల్‌ను కలెక్టర్ సందర్శించి.. ఉపాధ్యాయులు, విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు వడ్డించే ఆహార పదార్థాలను పరిశీలించారు. వారితో కలిసి నేలపై కూర్చుని కలెక్టర్ భోజనం తిన్నారు. విద్యార్థులకు విద్యతో పాటు మంచి భోజనం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ వరలక్ష్మి, తహసీల్దార్ పుణ్యవతి, ఎంపీడీఓ తేజోత్స్న, ఎంఈఓ వహిదా, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి దులీప్ ట్రోఫీ పాస్‌ల జారీ

అనంతపురం కార్పొరేషన్: దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచుల వీక్షణ కోసం శనివారం ఉదయం 11 గంటల నుంచి ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఎంట్రీ పాస్‌లు జారీ చేయనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) త్రీ మెన్ కమిటీ సభ్యులు మాంఛో ఫెర్రర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒక కౌంటర్ ద్వారా రోజూ 4వేల పాసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. మ్యాచ్ ప్రారంభమయ్యే రోజు ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తామని, ఆ తర్వాత వచ్చే వారికి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. స్టేడియం వెలుపల వనమిత్ర పార్క్ వద్ద పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్టేడియం వద్ద స్నాక్స్ కౌంటర్ అందుబాటులో ఉంచుతున్నట్లు పేర్కొన్నారు. ప్రేక్షకుల కోసం చుట్టుపక్కల వాష్ రూంలు అందుబాటులో ఉన్నాయని, వాటి రూటు తెలిసే విధంగా సైన్ బోర్డులు ఏర్పాటు చేశామని తెలిపారు. మ్యాచ్‌లే ప్రశాంతంగా నిర్వహించేందుకు అందరూ సహకరించాలని కోరారు.

సర్వజనాస్పత్రిలో మందుల్లేవ్!



❒ ఈ బాలింత పేరు నవ్య (కేకాతి, మడకశిర). ఈమెకు లివిప్రిల్ అనే మందును బయటకు రాసిచ్చారు. దీనికి రూ.200 వరకు ఖర్చయ్యింది.

❒ ఈ నెల 26న తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఈశ్వరయ్యకు వైద్యులు మెట్రోజిల్, రిడోటిల్, స్పోర్‌ల్యాక్ మందులను రాశారు. అయితే ఆస్పత్రిలో మందులు లేకపోవడంతో ఈశ్వరయ్య కుటుంబ సభ్యులు ప్రైవేట్ మెడికల్ స్టోర్‌లో కొనుగోలు చేయాల్సి వచ్చింది.

❒ ఇక్కడ కన్పిస్తున్న గర్భిణి గుమ్మఘట్ట మండలం బేలోడుకు చెందిన తిప్పమ్మ. ఈమెకు బీపీ ఉండడంతో వైద్యులు లెబటలాల్ మాత్ర (రూ.170)తో పాటు థైరాయిడ్ సమస్యకు సంబంధించి వేరే థైరాక్సిన్(రూ.194) మందులను రాశారు. అయితే వీటిని ప్రైవేట్‌గా కొనుగోలు చేయాల్సి వచ్చింది.



❒ ఈ బాలింతల పేర్లు గాయత్రి (గడేహోతూరు), సుభాషిణి (పామిడి). వీరు సర్వజనాస్పత్రిలో అడ్మిషన్ అయినప్పటి నుంచి లెబటలాల్, ట్రిప్సిరిన్ యాంటిబయాటిక్ మాత్రలను బయట నుంచి తెచ్చుకుంటున్నారు. వీటికి ఒక్కొక్కరికి రూ.300 వరకు ఖర్చు అయ్యింది.



- ఆరోగ్య శాఖ మంత్రి ఇలాకాలో దుస్థితి
- ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్న రోగులు
- 30 రకాలకుపైగా మందుల కొరత

అనంతపురం మెడికల్: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ప్రభుత్వ సర్వజనాస్పత్రిని మందుల కొరత పట్టిపీడిస్తోంది. యాంటీ బయాటిక్స్, ఇంజెక్షన్ల కొరతతో రోగుల జేబులకు చిల్లులు పడుతున్నాయి. ఇటీవల సర్వజనాస్పత్రి (బోధనాస్పత్రి)ని తనిఖీ చేసిన మంత్రి పేదలకు నాణ్యమైన వైద్యం అందిస్తామని ప్రకటించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సౌలభ్యాలు ఉండగా.. కూటమి ప్రభుత్వంలో అవి లేకపోవడం పాలకులకు ప్రజారోగ్యం పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో ఇట్టే అర్థమవుతోంది. కూటమి ప్రభుత్వంలో పేదలు ప్రభుత్వాస్పత్రిలో మందులు లేక ప్రైవేట్‌గా కొనుగోలు చేస్తున్నారు. సర్వజనాస్పత్రిలోని గైనిక్, మెడిసిన్ వార్డులతో పాటు క్యాజువాలిటీ, అక్యూట్ మెడికల్ కేర్, సర్జరీ, ఈఎన్‌టీ, పల్మనాలజీ, తదితర వార్డుల్లో రోగులు ప్రైవేట్‌గా మందులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. ఆస్పత్రిలో దూది, స్పిరిట్ కూడా పూర్తిస్థాయిలో లేవు. 200 మంది ఉండే వార్డులకు రెండు దూది ప్యాకెట్లు ఇస్తున్నారు. డ్రెస్సింగ్ చేసే సమయంలో దూది తక్కువగా ఉండడంతో రోగులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. రోజూ పదుల సంఖ్యలో యాక్సిడెంట్ కేసులు వస్తుంటాయి. గతంలో ప్రతి వార్డుకూ పదుల సంఖ్యలో కాటన్ ప్యాకెట్లు పంపేవారు. సర్జికల్ గ్లౌజులు లేవు. మాస్కులు అంతంత మాత్రమే. ఇన్ఫెక్షన్ వార్డుల్లో పని చేసే సిబ్బందికి మాస్కులు సరఫరా చేయకపోవడంతో వారు అవస్థలు పడుతున్నారు.

30 రకాలకుపైగా..

సర్వజనాస్పత్రిలో 30 రకాలకు పైగా మందుల కొరత పట్టిపీడిస్తోంది. లెబటలాల్ (బీపీ సమస్యతో ఉన్న వారికి వినియోగించే మందు), మెట్రోజిల్ (యాంటీ బయాటిక్), ప్యాంటాప్ (గ్యాస్ట్రిక్), మిథైల్ కోబాలమిన్ (నరాల సమస్యకు), డైక్లోఫెనాక్ (నొప్పులకు), అల్బుమిన్, ఇన్సులిన్, లివిప్రిల్, వాల్ప్రేట్ (చిన్నారులకు ఫిట్స్ వస్తే), తదితర 30 రకాల మందులు లేవు. ఈ మందుల అవసరం ఉందని డ్రగ్ స్టోర్ సిబ్బంది సెంట్రల్ డ్రగ్ స్టోర్స్‌కు నివేదించారు. అయినా నెల రోజులుగా మందుల కొరతతో రోగులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. కలెక్టర్ దృష్టి సారించి మందులు అందుబాటులో ఉంచాలని రోగులు కోరుతున్నారు.



ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డ్రగ్ స్టోర్

ప్రభుత్వ సర్వజనాస్పత్రి

రోజూ ఓపీ 2,500

అడ్మిషన్‌లో రోగుల సంఖ్య 1200

మందుల్లేని మాట వాస్తవమే

ప్రభుత్వాస్పత్రిలో దాదాపు 24 రకాల మందులు లేని మాట వాస్తవమే. నెలాఖరులోపు మందులు పూర్తిస్థాయిలో వచ్చేలా చూస్తాం. రోగులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ వెంకటేశ్వరరావు, సూపరింటెండెంట్, సర్వజనాస్పత్రి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో రైతు మృతి


నరసింహులు (ఫైల్)

ఉరవకొండ: ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఓ రైతు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... ఉరవకొండ మండలం చిన్న ముష్టూరు గ్రామానికి చెందిన బోయ నరసింహులు(51)కు భార్య లింగమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పెన్నహోబిలం వద్ద తనకున్న మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన సమయంలో విద్యుత్ మోటారు మొరాయించింది. దీంతో మోటారు వద్ద పరిశీలిస్తుండగా ఒక్కసారిగా విద్యుత్ ప్రసరణ జరిగి షాక్ గురై కుప్పకూలాడు. గమనించిన భార్య లింగమ్మ వెంటనే కూలీల సాయంతో ఉరవకొండలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలియగానే బాధిత కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి.

విత్తన సరఫరా ప్రారంభం


ఉలవలు


అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో ప్రత్యామ్నాయ విత్తన సరఫరా ప్రక్రియ మొదలైనట్లు వ్యవసాయశాఖ జేడీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. శుక్రవారం కూడేరు మండలానికి 300 క్వింటాళ్ల ఉలవలు అందజేసినట్లు ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్ కె.సుబ్బయ్య తెలిపారు. కాగా, ఖరీఫ్ సాగు తగ్గడంతో ప్రత్యామ్నాయ పంటల కింద జిల్లాకు 27,907 క్వింటాళ్ల ఉలవలు, పెసలు, అలసంద, కొర్ర, సజ్జ, మినుము విత్తనాలు కేటాయించారు. తాడిపత్రి, పుట్లూరు, యల్లనూరు, పెద్దపప్పూరు, డి.హిరేహాళ్ మినహా మిగతా 26 మండలాల్లో పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఆర్‌ఎస్‌కే వేదికగా విత్తన రిజిస్ట్రేషన్లు మొదలు పెట్టినా రైతుల నుంచి ఆశించిన స్పందన కనిపించక పోవడం గమనార్హం. సెప్టెంబర్ నెలంతా ప్రత్యామ్నాయ పంటల సాగుకు అనుకూలంగా ఉన్నందున ఈలోపు రైతులు విత్తనాలు తీసుకెళ్లి పంటలు విత్తుకునే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఉలవతో పాటు మిగిలిన విత్తనాలు కూడా ఒకట్రెండు రోజుల్లో మండలాలకు సరఫరా కానున్నట్లు సమాచారం.

పశు సంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ జేడీగా వెంకటస్వామి

అనంతపురం అగ్రికల్చర్: పశు సంవర్ధకశాఖ ఇన్‌చార్జ్ జేడీగా డాక్టర్ వెంకటస్వామిని నియమిస్తూ ఆ శాఖ డైరెక్టరేట్ నుంచి శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రస్తుత జేడీ సుబ్రహ్మణ్యం శనివారం ఉద్యోగ విరమణ చేస్తున్నారు. దీంతో పెనుకొండ గొర్రెల ఫాం డీడీగా పనిచేస్తున్న వెంకటస్వామికి జేడీ బాధ్యతలు అప్పగించారు. శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

రెవెన్యూలో అలజడి

- 2014-19 పరిస్థితులు పునరావృతం
- అప్పట్లో ఒత్తిళ్లకు తలొగ్గి పట్టాల పంపిణీ
- శింగనమల, కూడేరులో యథేచ్ఛగా దొంగ పట్టాలు
- అక్రమాలపై అప్పటి ఆర్డీఓ ద్వారా విచారణ
- వాస్తవమని నిర్ధారణ కావడంతో మూల్యం చెల్లించుకున్న అధికారులు



2017లో తరిమెలలో పట్టాలిచ్చిన సర్వేనంబర్ 899లోని రాళ్ల గుట్ట, 2018లో శింగనమల మండలంలో పట్టాలిచ్చిన సర్వేనంబర్ 648 లోని బసాపురం వంక

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత... టీడీపీ నాయకుల తీరుతో రెవెన్యూ శాఖలో అలజడి మొదలైంది. 2014-19 నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయని ఆ శాఖ అధికారులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అప్పట్లో అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గిన తహసీల్దారు కార్యాలయాల అధికారులు, సిబ్బంది ప్రభుత్వ భూములను ధారాదత్తం చేశారు. చివరకు రాళ్ల గుట్టలకు, వంకలకూ పట్టాలు ఇచ్చేశారు. ప్రధానంగా శింగనమల, కూడేరు మండలాల పరిధిలో పలు గ్రామాల్లో వేల ఎకరాల ప్రభుత్వ భూములకు యథేచ్ఛగా దొంగపట్టాలు జారీ చేశారు. ఈ అక్రమాలను 'సాక్షి' అప్పట్లోనే వెలుగులోకి తీసుకు రావడంతో వ్యవహారంపై ఉన్నతాధికారి విచారణ చేయించారు. అక్రమాలు వాస్తవమని నిర్ధారణ కావడంతో బాధ్యులైన అధికారులు, సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు.

శింగనమల మండలంలోని 9 గ్రామాల్లో..

శింగనమల మండల పరిధిలోని తొమ్మిది గ్రామాల్లో దాదాపు రెండు వేల ఎకరాల ప్రభుత్వ భూములకు దొంగపట్టాలు కట్టబెట్టారు. ఓ సర్వే నెంబర్‌కి 1, 2, 3, 4... ఇలా నంబర్లు సృష్టించారు. ఒక లెటర్‌లో ఒక్కొక్కరికి 3 ఎకరాల నుంచి 4.99 ఎకరాల వరకూ పట్టా జారీ చేశారు. ఆకులేడు, లోలూరు, తరిమెల, కల్లుమడి, జూలాకాలువ, కొరివిపల్లి, చీరేపల్లి, చక్రాయపేట, ఆనందరావు పేటలో దొంగపట్టాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ప్రధానంగా ఆకులేడు, కొరివిపల్లి, తరిమెలలో అత్యధికంగా దొంగపట్టాలు ఇచ్చారు. తరిమెలలో 899 సర్వే నెంబరు రాళ్ల గుట్టగా ఉంది. అయితే దీనికి పట్టాలు మంజూరు చేయడం గమనార్హం. కొరివిపల్లిలోనూ 172 సర్వే నెంబర్‌లో రాళ్ల గుట్టకు పట్టాలిచ్చారు. ఈ అవినీతిపై అప్పటి ఆర్డీఓ మలోలా విచారణ చేపట్టి వాస్తవమేనని నిర్ధారిస్తూ సమగ్ర వివరాలతో నివేదిక ఇచ్చారు.

కూడేరు మండలంలో అక్రమాలు ఇలా...

కూడేరు మండలంలోని బసాపురం వంక, కనికదేవ రాళ్ల గుట్ట, మాదిగోని బండ, కంకిర్లగుట్ట, వెంకటరాముతిప్ప, గొటుకూరు గ్రామాల్లో భూములకు, బాలప్ప చెరువు భూములకు, జయపురం ముంపుభూములకు పట్టాలిచ్చారు. విచిత్రం ఏమంటే 228 సర్వే నెంబరులోని రామదుర్గం వంక స్థలం 82 ఎకరాలు ఉంది. సోమేష్‌కుమార్ కలెక్టర్‌గా ఉన్న ఆ సమయంలో ఈ వంక స్థలంలో చింత-నిశ్చింత ప్రాజెక్టు కింద చింత మొక్కలు నాటారు. వాటిని తొలగించి ఈ భూములకు పట్టాలిచ్చేశారు. అలాగే నీళ్లు పారుతున్న బసాపురం వంక (సర్వే నెంబరు 648) పరిధిలోని 82.42 ఎకరాలకు పట్టాలిచ్చారు. ఇలా దాదాపు 2 వేల ఎకరాల ప్రభుత్వ భూములు, వంకలు, రాళ్ల గుట్టలకు టీడీపీ నేతలు అప్పట్లో పట్టాలు చేసుకున్నారు. ఈ వ్యవహారంపై కూడా అప్పటి ఆర్డీఓ మలోలా విచారణ చేపట్టి అక్రమాలు వాస్తావమేని నిర్ధారిస్తూ ఇచ్చిన నివేదిక ఆధారంగా అప్పటి కలెక్టర్ వీరపాండియన్ ఓ తహసీల్దారు, ఐదుగురు వీఆర్‌ఓలను సస్పెండ్ చేస్తూ 2019, జనవరి 10న ఉత్తర్వులిచ్చారు.

ఆందోళనలో రెవెన్యూ ఉద్యోగులు

ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 201-19 నాటి పరిస్థితులు పునరావృతమయ్యాయి. దీంతో ప్రధానంగా మండలాల్లో పనిచేస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. 2014-19 కాలంలో తీవ్ర ఒత్తిళ్లకు గురై పనిచేశామని రెవెన్యూ శాఖకు చెందిన పలువురు అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. ఇప్పుడూ ఆ తరహా పరిస్థితులు పునరావృతం కావడంతో విధులు నిర్వర్తించాలంటేనే భయమోస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారు చెప్పినట్లు తప్పుడు పనులు చేయకపోతే తమపై తప్పుడు ఫిర్యాదు చేస్తారని.... వారి చెప్పినట్లు తప్పుడు పనులు చేస్తే... అందుకు మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనే ఆందోళన అందరిలోనూ వ్యక్తమవుతోంది.

యువకుడి బలవన్మరణం


రాజశేఖర్ (ఫైల్)

యాడికి: తల్లి మందలించడంతో క్షణికావేశానికి లోనై ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికిలోని కొండకింద గేరిలో నివాసముంటున్న అచ్చమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు రాజశేఖర్ (23) ఉన్నారు. రాజశేఖర్ చిన్నప్పుడే తండ్రి చనిపోయాడు. అప్పటి నుంచి కూలి పనులతో ముగ్గురు పిల్లలను అచ్చమ్మ పెంచి పెద్దచేసింది. తల్లి కష్టాన్ని చూడలేక రాజశేఖర్ సైతం బేల్దారికి పనులు వెళుతూ చేదోడుగా నిలిచాడు. ఈ క్రమంలో ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసింది. కుమారుడి కోసం కొత్తగా ఇల్లు కూడా నిర్మించి ఇచ్చింది. కొంత కాలంగా రాజశేఖర్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. తాగుడుకు బానిసై జులాయిగా తిరగడం మొదలు పెట్టాడు. దీంతో శుక్రవారం ఉదయం తల్లి మందలించింది. తాగుడు మానేసి బుద్ధిగా పనిచేసుకుని బతకాలని హితవు పలికింది. దీంతో క్షణికావేశానికి లోనైన రాజశేఖర్ అదే రోజు మధ్యాహ్నం ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అంగడికెళ్లి సరుకులు తీసుకువచ్చిన అచ్చమ్మ... ఇంట్లోకి వెళ్లగానే ఉరికి విగతజీవిగా వేలాడుతున్న కుమారుడిని చూసి గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అక్కడకు చేరుకుని రాజశేఖర్‌ను కిందకు దించారు. అప్పటికే ప్రాణాలు కోల్పోయినట్లుగా నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో యాడికి పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

'ప్రైవేటు'లో ఫిట్‌నెస్ సేవలు

- సర్టిఫికెట్ల మంజూరు బాధ్యత 'శివశంకర్' సంస్థకు అప్పగిస్తూ ప్రభుత్వ ఆదేశాలు
- రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి వద్ద వాహన పరీక్షలు
- ఒకటో తేదీ నుంచి అమలు



అనంతపురం సెంట్రల్: రవాణా శాఖ కార్యాలయం (ఆర్టీఏ) అంటే ఒకప్పుడు అమ్మో అక్కడ పని చేయించుకోవడమా అని వాహనదారులు బెంబేలెత్తేవారు. ఏజెంట్లను ఆశ్రయించి గుట్టుగా పనులు చేయించుకునే వారు. ఇకపై వాహనదారులెవరూ ఆర్టీఏ కార్యాలయానికి రావాల్సిన అవసరం లేకుండా పోతోంది. ఒక్కొక్కటిగా ఆన్‌లైన్ చేస్తున్నారు. తాజాగా కీలకమైన వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ (ఎఫ్‌సీ)లు కూడా ప్రైవేటు సంస్థకు బాధ్యతలు అప్పగించారు. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుట్టారు. రాప్తాడు మండల పరిధిలోని ప్రసన్నాయపల్లి వద్ద ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. శివశంకర్ ఎంటర్‌ప్రైజస్ సంస్థ ఈ టెండర్ దక్కించుకుంది. వాహన యజమానులు ఫీజు, స్లాట్స్‌ను వాహన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకొని ఆయా స్లాట్స్ ప్రకారం టెస్టింగ్‌కు వెళ్లాల్సి ఉంటుంది. ఆటోమేటెడ్ టెస్టింగ్ ద్వారా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు మంజూరు చేయనున్నారు.

ఒక్కొక్కటిగా ఆన్‌లైన్..

రవాణాశాఖ కార్యాలయానికి ఒకప్పుడు రోజూ వందలాది మంది వాహనదారులు తమ పనుల కోసం వచ్చేవారు. వాహనాల రిజిస్ట్రేషన్ దగ్గర నుంచి డ్రైవింగ్ లైసెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్స్ వరకూ రావాల్సి ఉండేది. రోజూ వందల్లో వాహన రిజిస్ట్రేషన్‌లు జరిగేవి. కొన్నేళ్ల క్రితం రిజిస్ట్రేషన్ సేవలను ఆయా డీలర్లకే అప్పగించారు. దీంతో కొత్త వాహనాలు దాదాపు ఆర్టీఓ ఆఫీసుకు రావడం లేదు. అలాగే డ్రైవింగ్ టెస్ట్ సమస్య కూడా దాదాపు తగ్గిపోయింది. ఆటోమేటెడ్ టెస్టింగ్ ట్రాక్ ఏర్పాటు చేశారు. వాహనదారులు సక్రమంగా బండి నడపకుంటే సెన్సార్ ద్వారానే ఫెయిల్ చేస్తున్నారు. దీంతో ఆఫీసర్లకు ఇక్కడ పని పూర్తిగా తగ్గిపోయింది. తాజాగా కీలకమైన ఎఫ్‌సీలను కూడా ప్రైవేటు సంస్థకు అప్పగించారు. జిల్లాలోని అనంతపురంతో పాటు రాయదుర్గం, గుంతకల్లు, తాడిపత్రి ఆర్టీఏ పరిధిలోని ప్రతి వాహనం ఎఫ్‌సీ కోసం రాప్తాడు వద్దకు రావాల్సి ఉంటుంది. గతంలో ఎక్కడికక్కడ అధికారులు పరీక్ష నిర్వహించి సర్టిఫికెట్లు మంజూరు చేశారు.

పది సంవత్సరాలకు అనుమతి

వాహన ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను ఇక నుంచి శివశంకర్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ద్వారా జారీ చేయనున్నారు. ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఉత్తర్వులు వచ్చాయి. సెప్టెంబర్ 1 నుంచి ఈ నిబంధనలు వర్తిస్తాయి. 10 సంవత్సరాలకు వారికి కాలపరిమితి విధించారు. వాహనదారులు ఈ విషయాన్ని గమనించి ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్లాట్స్ బుక్ చేసుకొని అక్కడే పరీక్ష చేయించుకోవాలి. ఆర్టీఏ కార్యాలయాలకు ఇక నుంచి రావాల్సిన అవసరం ఉండదు.

– వీర్రాజు, ఉప రవాణా కమిషనర్

సజావుగా మునిసిపల్ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్


మాట్లాడుతున్న మునిసిపల్ ఆర్డీ పీవీవీఎస్ మూర్తి

అనంతపురం కార్పొరేషన్: మున్సిపల్ ఉద్యోగుల బదిలీలను పారదర్శకంగా చేపడుతున్నామని, దీనిపై ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ పీవీవీఎస్ మూర్తి అన్నారు. నగరంలోని తన కార్యాలయంలో నాలుగు జిల్లాల్లోని 37 మున్సిపాలిటీల్లో విధులు నిర్వర్తిస్తున్న క్లరికల్ స్టాఫ్‌కు శుక్రవారం చేపట్టిన బదిలీల కౌన్సెలింగ్‌ను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... జూనియర్ అసిస్టెంట్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్, సీనియర్ అకౌంటెంట్, బిల్ కలెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లకు బదిలీల కౌన్సెలింగ్ చేపట్టినట్లు తెలిపారు. సీనియారిటీ ప్రాతిపదికన నిబంధనల మేరకు బదిలీలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ ఆర్డీ కార్యాలయ సిబ్బంది నాగరాజు పాల్గొన్నారు.

గుంతకల్లు ఇన్‌చార్జ్ డీఎల్‌డీఓగా శంకర్

అనంతపురం సిటీ: కళ్యాణదుర్గం డీఎల్‌డీఓగా పని చేస్తున్న శంకర్‌కు గుంతకల్లు డివిజన్ అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకూ ఆ స్థానంలో ఇన్‌చార్జ్ బాధ్యతలను అనంతపురం డీఎల్‌డీఓ ఓబుళమ్మ నిర్వర్తిస్తూ వచ్చారు. దీంతో శుక్రవారం ఆమె గుంతకల్లు ఇన్‌చార్జ్ బాధ్యతలను శంకర్‌కు అప్పగించారు.

రాష్ట్ర టీడీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తా

- స్టోర్ కేటాయింపు విషయంలో పార్టీ అధిష్టానానికి యల్లనూరు మండల టీడీపీ నేత హెచ్చరిక
- ఎమ్మెల్యే బండారు తీరుపై మండిపాటు
- స్టోర్ కేటాయింపులో అన్యాయం చేశారంటూ జిల్లా టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా


జిల్లా టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నరేంద్రనాయుడు, కుటుంబసభ్యులు

అనంతపురం కార్పొరేషన్: తన మాట చెల్లుబాటు కాకపోతే మంగళగిరిలోని రాష్ట్ర టీడీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తానని పార్టీ అధిష్టానాన్ని యల్లనూరు మండలం వాసాపురం గ్రామానికి చెందిన ఆ పార్టీ నేత నరేంద్రనాయుడు హెచ్చరించారు. కాగా, ఎమ్మెల్యే శ్రావణి, నరేంద్రనాయుడు వర్గీయుల మధ్య ఎన్నికల ముందు నుంచే కోల్డ్‌వార్ నడుస్తోంది. ఎన్నికలకు ముందు టీడీపీ సీనియర్ నాయకులు ఇరు వర్గాలకు రాజీ చేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత సముచిత న్యాయం చేస్తామని భరోసానిచ్చారు. ఈ క్రమంలో వాసాపురంలో స్టోర్ కేటాయింపు అంశంలో మరోసారి విభేదాలు రచ్చకెక్కాయి. తమ వర్గీయుడికే స్టోర్ కేటాయించాలని నరేంద్రనాయుడు పట్టుబడితే.. ఎమ్మెల్యే శ్రావణి కాదని తన వర్గీయుడికి కట్టబెట్టారు. దీంతో ఎమ్మెల్యే వైఖరిని తప్పుబడుతూ శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని టీడీపీ కార్యాలయం ఎదుట నరేంద్రనాయుడు, కుటుంబసభ్యులు తులసమ్మ, జయప్రద, లక్ష్మి, హేమలత తదితరులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా నరేంద్రనాయుడు మాట్లాడుతూ.. యల్లనూరు మండలంలో గత 40 ఏళ్లుగా టీడీపీ అభివృద్ధికి తాము చేస్తూ వచ్చిన కృషిని వివరించారు. ఈ క్రమంలో తన సోదరుడు కేదార్‌నాయుడును ఫ్యాక్షన్ గొడవల్లో 2004లో పోగొట్టుకున్నామన్నారు. జెడ్పీటీసీ ఎన్నికల్లో రూ.11 లక్షల వరకూ ఖర్చు చేశామన్నారు. ఎన్నికలకు ముందు తమకు న్యాయం చేస్తామని భరోసానిచ్చిన ఎమ్మెల్యే... స్టోర్ కేటాయింపు విషయంలో ఏకపక్షంగా వ్యవహరించారని మండిపడ్డారు. ఈ అంశాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లానని, తాను చెప్పిన వారికి స్టోర్ కేటాయించకపోతే మంగళగిరిలోని టీడీపీ కార్యాలయం ఎదుట ధర్నా చేపడుతామని స్పష్టం చేశారు.

స్క్రూటినీ ముగిసింది.. పైరవీలు మొదలయ్యాయి

అనంతపురం ఎడ్యుకేషన్: సమగ్ర శిక్ష కార్యాలయంలో సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ పోస్టుల భర్తీలో భాగంగా శుక్రవారం దరఖాస్తుల స్క్రూటినీ ముగిసింది. దీంతో ఆశావహులు పైరవీలు ప్రారంభించారు. అకడమిక్ మానటరింగ్ అధికారి (ఏఎంఓ), జీసీడీఓ, అసిస్టెంట్ ఏఎంఓ (జనరల్), అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ), అసిస్టెంట్ అలెస్కో, అసిస్టెంట్ సీఎంఓ, అసిస్టెంట్ ఐఈడీ, ఏఎస్‌ఓ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కాగా, 36 మంది టీచర్ల (ఒక్కొక్కరు 4-5 పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు) నుంచి 110 దరఖాస్తులు అందాయి. 32 మంది టీచర్లు స్క్రూటినీకి హాజరయ్యారు. దాదాపు 100 దరఖాస్తులు, సర్టిఫికెట్లను విద్యాశాఖ ఏడీ కృష్ణయ్య ఆధ్వర్యంలోని బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. కాగా, ఆశావహులు పలువురు ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. కొందరైతే ఎమ్మెల్యేల ద్వారా మంత్రులకు సిఫార్సులు చేయించడం గమనార్హం.

వ్యక్తిని ఢీకొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు కారు


చికిత్స పొందుతున్న నాసిర్

చిలమత్తూరు: గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కారు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... శుక్రవారం హిందూపురం వైపు నుంచి వస్తున్న గుమ్మనూరు జయరాం కారు చిలమత్తూరు మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారి చేనేపల్లి క్రాస్ వద్ద శరవేగంగా వెళుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న హిందూపురం నివాసి, ఎలక్ట్రీషియన్ నాసిర్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదం జరిగినప్పుడు కారులో ఎమ్మెల్యే లేరని తెలిసింది.


యూపీఎస్ వద్దు... ఓపీఎస్ ముద్దు

- అశాస్త్రీయమైన పని సర్దుబాటును రద్దు చేయాలి
- డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ధర్నా


ధర్నాలో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు


అనంతపురం ఎడ్యుకేషన్: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెన్షన్లకు సంబంధించి కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపిన యూపీఎస్‌ను రద్దు చేస్తూ పాత పెన్షన్ విధానాన్నే (ఓపీఎస్) అమలు చేయాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు డిమాండ్ చేశారు. అసంబద్ధంగా, అశాస్త్రీయ విధానాలతో చేపట్టిన టీచర్ల పని సర్దుబాటు ప్రక్రియను వెంటనే రద్దు చేయాలన్నారు. డిమాండ్ల సాధనలో భాగంగా శుక్రవారం సాయంత్రం డీఈఓ కార్యాలయం ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ... మండల స్థాయిలోనే తక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలల నుంచి ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాల్సిన సింపుల్ ప్రక్రియ అన్నారు. అయితే దీనిని ఆన్‌లైన్ పేరుతో కఠినతరం చేశారన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ... ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్ట్ టీచర్లను నింపాలనే కారణంతో ఎస్జీటీలను బలవంతంగా సర్దుబాటు చేశారన్నారు. పని సర్దుబాటు పేరుతో ప్రాథమిక పాఠశాలలను బలహీన పరుస్తున్నారని మండిపడ్డారు. ఉపాధ్యాయ సంఘాలతో అంగీకరించిన నిబంధనలను ఉల్లంఘించారన్నారు. జిల్లా కార్యదర్శి నాగేంద్ర మాట్లాడుతూ... డీఈఓ, ఆర్జేడీ స్థాయి అధికారులను కూడా విశ్వసించకుండా యంత్రాలను నమ్మి ఉపాధ్యాయులను తీవ్ర మనోవేదనకు గురిచేయడం ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని వివిధ రాష్ట్రాల్లో ఆందోళనలు సాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం యూపీఎస్‌ను ముందుకు తీసుకురావడాన్ని ఆక్షేపించారు. కార్యక్రమంలో మెడికల్ రెప్స్ అసోసియేషన్ నాయకుడు శ్రీనివాసులు, సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమణయ్య, సహాధ్యక్షురాలు సరళ, రాష్ట్ర నాయకురాలు దేవేంద్రమ్మ, మునిసిపల్ యూనియన్ నాయకులు ఎర్రిస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

క్రికెట్ పిచ్‌పై క్యూరేటర్ సంతృప్తి


క్యూరేటర్ సమందర్ సింగ్

అనంతపురం కార్పొరేషన్: దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీల సన్నాహకాల్లో భాగంగా శుక్రవారం అనంతపురం క్రికెట్ గ్రౌండ్(ఏసీజీ) పిచ్‌ను క్యూరేటర్ సమందర్ సింగ్ పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే నెల 5 నుంచి 22వ తేదీ వరకూ ఏసీజీ మైదానాల్లో దులీప్ ట్రోఫీ క్రికెట్ పోటీలు జరగనున్నాయి. ఈ క్రమంలో మైదానం నిర్వహణ బాధ్యతలను క్యూరేటర్ సమందర్‌సింగ్‌కు బీసీసీఐ అప్పగించిన విషయం తెలిసిందే. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన ఆయన 40 ఏళ్లుగా బీసీసీఐ ప్యానెల్ క్యూరేటర్‌గా పనిచేస్తున్నారు. వివిధ ప్రపంచ కప్ మ్యాచ్‌లకు క్యూరేటర్‌గాను వ్యవహరించారు. ప్రస్తుతం అనంతపురం క్రికెట్ గ్రౌండ్‌కు క్యూరేటర్‌గా వచ్చిన ఆయన ఇక్కడి మైదానం, పిచ్ పటిష్టతపై సంతృప్తి వ్యక్తం చేయడం గమనార్హం.

వైభవంగా జైనబ్బీ షంషేరు


షంషేరును ఊరేగిస్తున్న దృశ్యం

ఉరవకొండ: ప్రసిద్ధిగాంచిన ఉరవకొండ హజరత్ బీబీ జైనబ్బీ అమ్మవారి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి షంషేరు వేడుకను శుక్రవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. జైనబ్బీ దర్గా నుంచి గుర్రంపై షంషేరును ఊరేగించారు. ఉత్సవంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే రాత్రి నిర్వహించిన ఖవ్వాలి ఉత్కంఠగా సాగింది. ఉత్తర ప్రదేశ్‌లోని జలాల్‌బాద్‌కు చెందిన ప్రఖ్యాత గాయకుడు రైస్ అనీస్ సబ్రీ తన గాత్రంతో ఆకట్టుకున్నారు. దర్గా ఆవరణలో విడిది చేసిన భక్తులతో ఆ ప్రాంతం కిక్కిరిసింది.

● వైభవంగా శ్రీవారి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు


పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

వజ్రకరూరు: మండలంలోని కొనకొండ్ల గ్రామంలో వెలసిన ఆదిచెన్నకేశవస్వామి రథోత్సవం శుక్రవారం సాయంత్రం అంగరంగ వైభవంగా సాగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు పెద్ద ఎత్తున జరిగాయి. 11 గంటలకు పల్లకీ సేవ అనంతరం మడుగుతేరు లాగారు. సాయంత్రం 5 గంటలకు ఉట్ల ఉత్సవం ఉత్కంఠగా సాగింది. అనంతరం ఆలయంలో విశేష పూజలు నిర్వహించి స్వామి ఉత్సవమూర్తులను ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై అధిష్ఠింపజేశారు. ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు వేలాదిగా తరలిరావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిసాయి. కార్యక్రమంలో సర్పంచ్ నంచర్ల ఇందిరమ్మ, మాజీ ఎంపీపీ రామచంద్ర, ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, ముద్దయ్య, ఆలయ ఈఓ దేవదాసు, అంగదాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. కాగా, ఉత్సవాల్లో భాగంగా శనివారం వసంతోత్సవం నిర్వహించనున్నారు.

15లోపు ఈ- క్రాప్ చేయించుకోండి


చిన్నంపల్లిలో ఈ- క్రాప్ నమోదులో పాల్గొన్న జిల్లా వ్యవసాయ అధికారి

శెట్టూరు: ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలను సెప్టెంబర్ 15వ తేదీలోపు ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ రైతులకు సూచించారు. శుక్రవారం చిన్నంపల్లిలో జరుగుతున్న ఈ- క్రాప్ నమోదును ఆమె పరిశీలించారు. నమోదు ప్రక్రియ ఎలా సాగుతోంది.. ఏ పంటలు ఎంత విస్తీర్ణంలో సాగయ్యాయి తదితర వివరాల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో బోరు బావుల కింద సాగైన కంది, వేరుశనగ, ఆముదం, వరి, టమాట తదితర పంటలను పరిశీలించారు. వ్యవసాయ, రెవెన్యూ సిబ్బంది సయుక్తంగా నిర్దేశిత గడువులోపు ఈ- క్రాప్ పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జ్ ఏఓ జగదీష్ బాబు, ఏఈఓ ఆంజనేయులు, ఆర్‌ఎస్‌కే సిబ్బంది రమణ, అరవింద్ రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మాదక ద్రవ్యాలతో అనర్థాలు



మాట్లాడుతున్న సైకియాట్రిస్ట్ డాక్టర్ విశ్వనాథ్

రాప్తాడు: యువత మాదక ద్రవ్యాలకు ఆకర్షితులు కావొద్దని సైకియాట్రిస్ట్ డాక్టర్ విశ్వనాథ్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి శివ కృష్ణ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాల్సిన యువత మాదక ద్రవ్యాల బారిన పడి జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. సమాజంలో నేడు ఆల్కహాల్ తీసుకునే వారి సంఖ్య అధికంగా ఉందన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిసై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హెచ్చరించారు. మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారి భవిష్యత్తు, ఆరోగ్యం ప్రశ్నార్థకరంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం సాంబశివ, సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్‌వైజర్ అరుణ, ఏఎన్ఎం లీలావతి, ఆశా కార్యకర్తలు గాయిత్రి, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ ఫార్మసీ అసోసియేషన్ అధ్యక్షుడిగా జక్కుల మాధవ



అనంతపురం మెడికల్: స్థానిక డీఎంహెచ్ఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏపీ ఫార్మసీ అసోసియేషన్ అనంతపురం జిల్లా శాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జక్కుల మాధవ, ఉపాధ్యక్షులుగా ఎన్.శ్రీధర్, సరస్వతమ్మ, ఫయాజ్, కుళ్లాయ్ బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీహరి, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఉమామహేష్, సంయుక్త కార్యదర్శిగా రాంబాబు, నల్లప్ప, విశ్వనాథ్, కోశాధికారిగా చెన్నె శెట్టి ఎన్నికయ్యారు. జక్కుల మాధవ వరుసగా మూడోసారి అధ్యక్షుడిగా ఎంపిక కావడంతో సభ్యులు అభినందనలు తెలిపారు.

పక్కాగా పంటకోత ప్రయోగాలు



మాట్లాడుతున్న తహసీల్దార్ లక్ష్మీనాయక్, ఏఓ సుచరిత

ఆత్మకూరు: పంటకోత ప్రయోగాలు పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ లక్ష్మీనాయక్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఓ సుచరిత, ఏఈఓ మమత, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పంటకోత ప్రయోగాలు నిర్వహించే సమయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు సాగు చేసిన పంటలో ప్రభుత్వ అధికారుల కొలతల ప్రకారం చుట్టూ తాడు వేసి ఆ తాడు వేసిన భాగం ఎంత మేరకు ఉందో తెలుసుకుని పంట తొలగించాలన్నారు. తూకం వేసేటప్పుడు ఎలాంటి అవకతవకలు లేకుండా తూకాలు వేయాలన్నారు. మండలంలో రెండు చోట్ల పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తారని రెండింటిలో వచ్చిన పంట తూకాలను బట్టి వచ్చిన దిగుబడి తూకాన్ని పక్కాగా ఉన్నత అధికారులకు నివేదికలు పంపాలని ఆదేశించారు. అదే విధంగా ఈ–క్రాప్ బుకింగ్‌లో ఏదైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.

నేత్రపర్వంగా కన్నయ్య ఊరేగింపు



నగర వీధుల్లో శ్రీకృష్ణుడి ప్రతిమను ఊరేగిస్తున్న దృశ్యం

అనంతపురం కల్చరల్: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఐదు రోజులుగా సాగిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. కృష్ణాష్టమి రోజున అరవిందనగర్‌లో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణుడికి నిత్య పూజలు నిర్వహిస్తూ గీతాపారాయణం సాగిస్తున్న నిర్వాహకులు శుక్రవారం నగర వీధుల్లో స్వామిని ఊరేగించారు. అరవింద నగర్ నుంచి హౌసింగ్ బోర్డు, పాతూరు వీధుల మీదుగా పూలపల్లకీలో నగరోత్సవం సాగింది. అంతకు ముందు టూటౌన్ ఎస్ఐ చంద్రశేఖర్ కొబ్బరికాయ కొట్టి ఊరేగింపు ప్రారంభించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు మల్లికార్జున మాట్లాడుతూ.. భగవంతుడే మనిషిగా అవతరించిన పవిత్ర భూమిపై నివసించే అందరూ సాటివారి అభ్యున్నతికి తోడ్పడాలనే శ్రీకృష్ణ సందేశాన్ని వినిపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

హస్తకళల కాణాచి.. లేపాక్షి ఎంపోరియం

- గత ఐదేళ్లలో ప్రణాళికాబద్ధంగా పెరిగిన ఆదాయం
- 2023–24లో రూ.1.53 కోట్ల అమ్మకాలు
- ఆకట్టుకుంటున్న కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక చెక్క సామగ్రి, కళంకారీ పెయింటింగ్స్



టవర్ క్లాక్ సమీపంలో ఉన్న లేపాక్షి ఎంపోరియం



ఆకట్టుకుంటున్న కొండపల్లి బొమ్మలు

అనంతపురం కల్చరల్: తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను చాటే కొండపల్లి బొమ్మలు, ఏటికొప్పాక చెక్కసామాను, టెర్రకోట ఉడ్‌కార్వింగ్, కలంకారీ పెయింటింగ్స్, ఇలా వంద మందిలో ఉన్నా ప్రత్యేకతను చాటే కళాత్మక వస్తువులు చూడాలనుకుంటే ఎవరైనా లేపాక్షి ఎంపోరియం రాక తప్పదు. రాష్ట్ర కళా ఉత్పత్తులే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఆచార వ్యవహారాలు, సంస్కృతులకు అద్దం పట్టే కళా ఉత్పత్తులను అందించే జిల్లా కేంద్రంలోని లేపాక్షి ఎంపోరియం వెనుక ఆసక్తికరమైన చరిత్రే ఉంది. భారతీయత ఉట్టిపడే కళాకారుల ప్రతిభకు పట్టం కట్టాలనే ఉద్దేశంతో 1959లో ఏపీ స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్ పేరుతో పరిశ్రమల శాఖ ఆధీనంలో నేటి లేపాక్షి ఎంపోరియం ఆవిర్భవించింది.

ముందు వరుసలో 'అనంత'

రాష్ట్రంలో ప్రత్యేకత కలిగిన తిరుమల, విజయవాడ, విశాఖ వంటి అధిక జనాభా ఉన్న ప్రాంతాలను మినహాయిస్తే ఇక అన్ని జిల్లా కేంద్రాల్లో లేపాక్షి ఎంపోరియాలున్నాయి. అనంత ఎంపోరియం లక్ష్య సాధనలో ముందుంది. 2019కి ముందు కేవలం రూ.70 లక్షల అమ్మకాలకే ముక్కిమూల్గుతూ సాగిన ఎంపోరియం ప్రదర్శనలు, అమ్మకాలలో గణనీయమైన మార్పు వచ్చింది. గత ఐదేళ్లలో ఏటేటా పెరుగుతూ వచ్చిన ఆదాయం 2023–24 సంవత్సరంలో ఏకంగా రూ.1.53 కోట్ల లక్ష్యాన్ని చేరుకుంది.

ఆకట్టుకునే సజీవ కళానైపుణ్యం

జిల్లా కేంద్రంలో టవర్‌క్లాక్ సమీపంలో ఉండే లేపాక్షి ఎంపోరియంలో అడుగుపెట్టగానే నిలువెత్తు కలియుగ ప్రత్యక్షదైవమైన వేంకటేశ్వరుడి నిలువెత్తు రోజ్ ఉడ్ ప్రతిమ ఆకట్టుకుంటుంది. అనంతకు చెందిన లెదర్ పప్పెట్స్, బ్రాంజ్ ఐటమ్స్, బొబ్బిలి వీణలు, మైసూరు రోజ్‌వుడ్ పేపర్ మెష్, కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, తిరుపతికి చెందిన ఇత్తడి కళాత్మక వస్తువులు, తిరుమల ఉడ్ కార్వింగ్, రాజస్థానీ వైట్ ఉడ్, తిరుపతికి చెందిన ఫొటో ఫ్రేమ్స్ ఇలా ప్రతీది దేశ సమైక్యతను చాటుతూ అన్ని ప్రాంతాల కళలు ఒకచోట చేరినట్లు ప్రదర్శనలో కనిపిస్తాయి. విదేశీయులను సైతం ఉత్పత్తులు ఆకర్షిస్తున్నాయి. ప్రత్యేక ఎగ్జిబిషన్ల ద్వారా దేశ వ్యాప్తంగా హస్తకళాకారులు తమ ఉత్పత్తులను ఈ ఎంపోరియం ద్వారా అమ్ముకుంటూ వందల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. చాలా మంది తోలుబొమ్మలంటే నిమ్మలకుంటవే అనుకుంటారు.. కానీ అనంత శివారులో నివాసముండే కళాకారులు సైతం అద్భుతమైన లెదర్ ఉత్పతులు, అలాగే ఆర్డీటీ వారి జూట్ వస్తువుల తయారీలో అందరితో పోటీ పడుతున్నారు. త్వరలో బనానా ఫైబర్ వస్తువుల శిక్షణను అందిస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

హస్తకళలను ఆదరించాలి



నిస్సందేహంగా రాష్ట్ర కీర్తిని ఘనంగా చాటే జిల్లా ప్రత్యేకతలో లేపాక్షి ముందుంటుంది. చాలా మంది నాణ్యత లేని వస్తువులకు హస్తకళల రూపునిచ్చి అమ్ముతుంటారు. బిల్లుల గోల ఉండదు. పాడైనా అడిగే దిక్కుండదు. కానీ లేపాక్షి ఎంపోరియంలో ప్రతిదానికి కచ్చితమైన ప్రామాణికముంటుంది. గతేడాది ఎన్నడూ లేని విధంగా రూ.1.53 కోట్ల లక్ష్యాన్ని చేరుకున్నాం. దేశ సంస్కృతికి ప్రతీకగా నిలిచే హస్తకళలను అందరూ ఆదరించాలి.

– శ్రీనివాసులు, లేపాక్షి ఎంపోరియం మేనేజర్

బ్యాంకర్లతోనే సమస్యలు



మా పూర్వీకుల నుంచి తోలుబొమ్మల వృతిని ఆధారంగా చేసుకుని జీవిస్తున్నాం. మేము దేశంలోని విజయవాడ, హైదరాబాద్, తిరుపతి వంటి తెలుగు ప్రాంతాలతో పాటూ లక్నో, ఢిల్లీ, రాజస్థాన్, మైసూరు లాంటి జాతీయ స్థాయి ఎగ్జిబిషన్లలో అనంత ఖ్యాతిని చాటే లెదర్ పప్పెట్స్, హ్యాంగింగ్ లాంప్స్, గిఫ్ట్ ఐటమ్స్ వంటి ఉత్పత్తులను ప్రదర్శించాం. మా ప్రధాన సమస్య బ్యాంకర్లు మమల్ని నమ్మి లోన్లను మంజూరు చేయడం లేదు.

– సుబ్బారావు, తోలుబొమ్మల కళాకారుడు, అనంతపురం

అఘాయిత్యాలపై స్పందించరా?

అనంతపురం ఎడ్యుకేషన్: గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో అమ్మాయిల బాత్రూంల్లో కెమెరాలు పెట్టి వీడియోలు తీసి వాటిని అమ్ముకోవడం సిగ్గుచేటు. ఇలాంటి సంఘటనపై ఉప ముఖ్యమంత్రి, విద్యాశాఖ మంత్రి, హోం మంత్రి స్పందించక పోవడం హాస్యాస్పదం అని వైఎస్సార్ విద్యార్థి భాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మద్దిరెడ్డి నరేంద్ర రెడ్డి మండిపడ్డారు. శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. తనకు అవకాశం ఇస్తే అమ్మాయిలపై అఘాయిత్యాలకు పాల్పడే వారిపై ఎంతటి కఠిన చర్యలు తీసుకుంటానో చూపిస్తానంటూ పవన్ కళ్యాణ్ గతంలో అనేక సందర్భాల్లో చెప్పారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయనే డిప్యూటీ ముఖ్యమంత్రిగా ఉన్నారు.. ఈ ఘటనపై ఎందుకు స్పందించ లేదని ప్రశ్నించారు. విజయ్ అనే వ్యక్తి పవన్ కళ్యాణ్ అభిమాని కావడం వల్ల చర్యలు తీసుకోకుండా ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందన్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందన్నారు. అనంతపురంలో ప్రభుత్వ హాస్టల్‌లో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ కళాశాలలో దాదాపు 1000 మంది అస్వస్థతకు గురయ్యారని తెలిపారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ మంత్రి నోరు మెదపకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



మొక్కకు నీరు పోస్తున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని మేయర్ వసీం పిలుపునిచ్చారు. శుక్రవారం నగరంలోని రాజేంద్ర నగరపాలక పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై అవగాహన ఉండాలన్నారు. కోవిడ్ విపత్కర పరిస్థితుల్లో ఆక్సిజన్ ఆవశ్యకత మానవాళికి తెలిసిందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అదనపు కమిషనర్ శ్రీహరి బాబు, ఏడీఏ లక్ష్మీప్రసన్న, కార్పొరేటర్లు లీలావతి, బాలాంజనేయులు, కమల్‌భూషణ్, అబూసలేహా, సైపుల్లాబేగ్, హెచ్ఎం రామానుజులు, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు, ఏపీటీఎఫ్ నాయకులు ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి

అనంతపురం మెడికల్: మొక్కలను నాటడమే కాకుండా వాటిని సంరక్షించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. హరిత ఆంధ్రప్రదేశ్–వనం మనం, వనమహోత్సవంలో భాగంగా డీఎంహెచ్ఓ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ మొక్క నాటి, సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆవరణలో మొక్కలు నాటేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమ, కార్యాలయం పరిపాలనాధికారి గిరిజా మనోహర్ రావు, డెమో త్యాగరాజు, గంగాధర్, సూపరింటెండెంట్లు విజయభాస్కర్ రెడ్డి, శ్రీనివాసులు, సురేష్ కుమార్, పవన్, కమలాకర్ రాజు, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

ఇదెక్కడి ప్రచార యావ



ఈనెల 29న జరిగిన 5కే మారథాన్‌లో ఇచ్చిన చెక్కునే రాజేంద్ర నగరపాలక స్కూల్‌కు అందిస్తున్న ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అనుపమ జేమ్స్

అనంతపురం మెడికల్: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ అధికారులు ప్రచార యావతో ప్రజలను మభ్యపెడుతున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. నేషనల్ యూత్ ఫెస్ట్‌కు సంబంధించి ఈనెల 29న నగరంలోని 5కే రన్‌ను ఆరోగ్యశాఖ నిర్వహించింది. అందులో విజేతలకు రూ.7,000 చెక్కును సాక్షాత్తు కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ చేతుల మీదుగా అందించారు. శుక్రవారం నగరంలోని రాజేంద్ర నగరపాలక పాఠశాలలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై జిల్లాలోని వివిధ స్కూళ్లకు చెందిన 8, 9వ తరగతి విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. వాస్తవంగా ఈ పోటీల్లో విజేతలుగా గుంతకల్లులోని సర్వేపల్లి రాధాకృష్ణ మునిసిపల్ హైస్కూల్ విద్యార్థిని నందిని, గుంతకల్లు ఎస్‌జేపీ హైస్కూల్ విద్యార్థిని మధిహా ఇమాన్ మొదటి బహుమతి (రూ.5,000), పామిడి ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు మహీధర్, సంపత్ కుమార్‌కు ద్వితీయ బహుమతి (రూ.4,000), కొర్రపాడు డాక్టర్ అంబేడ్కర్ గురుకులం విద్యార్థినులు శిరీష, భవిష్యలకు తృతీయ బహుమతి (రూ.3,000) ఇచ్చారు. ఇదెలా ఉన్నా.. ఆరోగ్యశాఖాధికారులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా రాజేంద్ర మునిసిపల్ నగరపాలక పాఠశాలకు రూ.7,000 చెక్కు ఇస్తున్నట్లు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడం సర్వత్రా విమర్శలకు దారి తీస్తోంది. కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ అధికారిణి డాక్టర్ అనుపమజేమ్స్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు



పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఏడీ, సీనియర్ అసిస్టెంట్లను సన్మానించిన దృశ్యం

అనంతపురం అగ్రికల్చర్: స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయ ఆవరణలో శుక్రవారం పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యంకు ఘనంగా వీడ్కోలు పలికారు. అలాగే ఏడీ డాక్టర్ నాగార్జున రెడ్డి, సీనియర్ అసిస్టెంట్లు రాజశేఖర రెడ్డి, వై.విజయలక్ష్మిని సన్మానించి వీడ్కోలు పలికారు. జేడీ, ఏడీ, సీనియర్ అసిస్టెంట్లు శనివారం అధికారకంగా ఉద్యోగ విరమణ చేయనున్నారు. కార్యక్రమంలో డీఆర్ఓ రామకృష్ణారెడ్డి, వ్యవసాయశాఖ జేడీ ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ వేణుగోపాలరెడ్డి, సత్యసాయి జిల్లా పశుశాఖ జేడీ డాక్టర్ శుభదాస్, డీడీలు డాక్టర్ రమేష్‌రెడ్డి, డాక్టర్ వెంకటేష్‌తో పాటు ఏడీలు, వీఏఎస్‌లు, ఇతర సిబ్బంది హాజరై గౌరవంగా వీడ్కోలు పలికారు.

అనంతపురం మెడికల్: ఆరోగ్యశాఖలో గత కొన్నేళ్లుగా సేవలందించిన చీఫ్ ఫార్మసీ అధికారి రామశంకర్ సేవలు మరువలేనివని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. శుక్రవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఆయన ఉద్యోగ విమరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా రామశంకర్ దంపతులను డీఎంహెచ్ఓ పూలమాల వేసి శాలువాతో సన్మానించారు. రామశంకర్ శేష జీవితం సంతోషంగా సాగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సుజాత, డాక్టర్ అనుపమజేమ్స్, ఏఓ గిరిజా మనోహర్ పాల్గొన్నారు.

'పింఛన్ల పంపిణీ ఈ రోజే పూర్తవ్వాలి'

రాప్తాడురూరల్: సెప్టెంబర్ 1 సెలవు రోజు కావడంతో ముందురోజే సామాజిక పింఛన్ల పంపిణీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అనంతపురం రూరల్ మండలంలో పింఛన్లన్నీ ఈ ఒక్క రోజే (శనివారం) పంపిణీ చేసేయాలని ఎంపీడీఓ పుల్లయ్య ఆదేశించారు. శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో టెలీ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. రూరల్ మండలంలో పింఛన్ల పంపిణీకి మొత్తం 309 మంది సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. వారంతా ఉదయం 6 గంటల నుంచే పింఛన్ల పంపిణీలో పాల్గొనాలని ఆదేశించారు. ఒక్కో ఉద్యోగి 50 నుంచి 90 పింఛన్లు పంపిణీ చేయనున్నారన్నారు. పింఛన్‌దారులెవరూ కార్యాలయాల వద్దకు రాకూడదన్నారు. వారి ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని ఆదేశించారు. మండలంలో మొత్తం 17,622 పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అత్యధికంగా పాపంపేట 5వ సచివాలయం పరిధిలో 953 పింఛన్లు, అత్యల్పంగా రుద్రంపేట–3 సచివాలయ పరిధిలో 246 పింఛన్లు ఉన్నాయన్నారు. ఎవరైనా నిర్లక్ష్యంచేస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రైల్వే ఉద్యోగులపై చర్యలు తీసుకోండి

అనంతపురం సెంట్రల్: రైల్వే ఉద్యోగి మాల నాగమణి ఆత్మహత్యకు సాటి ఉన్నత ఉద్యోగులే కారణమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బాధిత కుటుంబ సభ్యులతో శుక్రవారం అడిషనల్ ఎస్పీ రమణమూర్తిని కలసి వినతిపత్రం అందజేశారు. నగరంలో నివాసముంటున్న నాగమణి కదిరి రైల్వేస్టేషన్‌లో జేఈగా పని చేస్తుండేదన్నారు. రైల్వే ఉన్నత ఉద్యోగులు వేధించడంతో జూలై 2న ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని తెలిపారు. ఘటనపై అప్పట్లోనే మృతిరాలి తల్లి సామ్రాజ్య లక్ష్మి నాల్గవ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు ఓబిలేసు, సమతా సైనిక్ దల్ జిల్లా అధ్యక్షులు సుగుమంచి శ్రీనివాసులు, జేఏసీ నాయకులు రామకృష్ణ, నారాయణ స్వామి, రమేష్, మారెప్ప, గోపాల్, సంతోష్, బాధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి



మాట్లాడుతున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు

అనంతపురం సెంట్రల్: జేఎన్‌టీయూలో చదువుకున్న ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శన రావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆడిటోరియం భవనంలో జేఎన్‌టీయూ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ అంచలంచెలుగా ఎదిగిన విధానాన్ని వైస్ చాన్స్‌లర్ వివరించారు. రాబోయే కాలంలో ఉన్నత స్థాయికి చేరుకున్న ప్రతి ఒక్కరూ యూనివర్సిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. యూనివర్సిటీ ఆవిర్భవించిన తర్వాత నిర్మాణ అభివృద్ధి, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై వివరించారు. అందరి సహకారంతో యూనవర్సిటీని ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ.. యూనివర్సిటీలో సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ ఎస్.దేవన్న, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి, నాగప్రసాద్ నాయుడు, దుర్గాప్రసాద్, ఈశ్వర్‌రెడ్డి, విశాలి, వైశాలి, కిరణ్మయి తదితరులు పాల్గన్నారు.

ఆలయాల్లో శ్రావణ పూజలు



అలంకరణలో నిముషాంబ దేవి

అనంతపురం కల్చరల్: పవిత్ర శ్రావణమాసంలో వచ్చిన చివరి శుక్రవారం కావడంతో నగరంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ లక్ష్మీ నమోస్తుతే అంటూ భక్తుల శరణుఘోషతో ప్రతిధ్వనించాయి. వివిధ చోట్ల అమ్మవారి ఆలయాలలో సామూహిక కుంకుమార్చనలు, అభిషేకాలు, అలంకార సేవలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం, శారదానగర్ శృంగేరీ శారదా శంకర మఠంలో కుబేర వ్రతాలు ఘనంగా జరిగాయి. రామనగర్‌లోని పెద్దమ్మ తల్లి దేవాలయం, శంకరమఠంలో శారదామాత, శివబాలయోగి ఆశ్రమంలో అనంతేశ్వరి, శివకోటి తదితర చోట్ల సందడి నెలకొంది.

రేపు మద్దూరి నగేష్ బాబు సాహిత్య సదస్సు

అనంతపురం కల్చరల్: జెన్నే వైష్ణవి భాష సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం సుప్రసిద్ధ దళిత సాహిత్య దళనాయకుడు మద్దూరి నగేష్ బాబు సమగ్ర సాహిత్యంపై సదస్సు జరుగనుంది. స్థానిక ఎన్జీఓ హోంలో ఉదయం 10 గంటలకు జరిగే సాహితీ కార్యక్రమానికి అందరూ విచ్చేయాలని నిర్వాహకుడు ఆనంద్ కుమార్ కోరారు.

విద్యార్థినులకు రక్షణ కల్పించాలి

అనంతపురం ఎడ్యుకేషన్: కృష్ణా జిల్లా గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో అమ్మాయిల బాత్రూంలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన ఉదంతం వెలుగు చూసిన నేపథ్యంలో అమ్మాయిలకు రక్షణ కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓతూరు పరమేష్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కళాశాలలో యాజమాన్యం పర్యవేక్షణ లోపం కారణంగానే ఘటన చోటు చేసుకుందని పేర్కొన్నారు. ఇది విద్యార్థినుల మానప్రాణాలకే ప్రమాదమన్నారు. ఉన్నత చదువుల కోసం కళాశాలకు వస్తున్న విద్యార్థినుల రక్షణ గురించి యాజమాన్యాలు ఆలోచించడం లేదన్నారు. వీడియో రికార్డ్ చేశారని విద్యార్థినులు చెబుతుండటంతో సమగ్ర దర్యాప్తు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అభాగ్యుడికి చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి

అనంతపురం కల్చరల్: నిరుపేదలు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మానవత్వంతో స్పందించి సాయమందించే అమ్మ సంస్థ నిర్వాహకుడు తరిమెల రమణారెడ్డి మరో అభాగ్యుడికి అండగా నిలిచారు. వివరాలు.. పాతూరుకు చెందిన బోయ మారుతీ ప్రసాద్ ఆటో నడుపుకుంటూ భార్య సునీత, ఇద్దరు పిల్లలతో హాయిగా జీవించేవాడు. గతేడాది గుండెపోటు రావడంతో వాళ్లింటి పరిస్థితి తారుమారైపోయింది. చిన్నప్పటి నుంచి రుమటాలజీ సమస్య ఉండటం, దానికి తోడు ఎక్కువగా హై స్టెరాయిడ్స్ ఉన్న మందులు వాడటంతో అదే ఏడాది బ్రెయిన్ స్ట్రోక్ కూడా వచ్చింది. ఆర్థికసాయం కోసం అమ్మ సంస్థను ఆశ్రయించాడు. తక్షణమే స్పందించిన రమణారెడ్డి రూ.70 వేల చెక్కుతో పాటూ నిత్యావసర వస్తువులు, మందులు అందజేశారు. భవిష్యత్తులోనూ మారుతీ ప్రసాద్ వైద్య ఖర్చులకు సాయం అందిస్తానని రమణారెడ్డి భరోసా ఇచ్చారు.

గురుకుల ప్రవేశ దరఖాస్తు గడువు పెంచాలి

అనంతపురం ఎడ్యుకేషన్: జిల్లాలోని అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి 5–8 తరగతుల్లో అదనపు సీట్ల భర్తీకి దరఖాస్తు గడువు పొడిగించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 189 సీట్ల భర్తీకి ఆమోదం తెలపడం మంచి నిర్ణయం అన్నారు. వీటి దరఖాస్తుకు కేవలం రెండు రోజులు మాత్రమే గడువు ఇవ్వడం వల్ల చాలామంది సమాచారం లేక దరఖాస్తు చేసుకోలేకపోతున్నారన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అవగాహన ఉండదన్నారు. కలెక్టర్ స్పందించి దరఖాస్తు గడవు పెంచాలన్నారు.

వృద్ధులకు చీరల పంపిణీ

అనంతపురం కల్చరల్: నగరంలోని అమ్మ ఒడి వృద్ధాశ్రమంలో శుక్రవారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర, నారాయణ నాయక్ మాట్లాడుతూ.. వృద్ధులైన తల్లిదండ్రులను చివరి దశలో ఎటువంటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు.